కాఫీ బోర్డు సదస్సుకు డిప్యూటీ సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 25నుంచి 28వరకు బెంగళూరులో నిర్వహించనున్న ప్రపంచ కాఫీ బోర్డు సదస్సుకు హాజరు కావాలని కోరుతూ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్ శనివారం ఆహ్వానం అందజేశారు. ప్రపంచంలో కాఫీ ఉత్పత్తి చేసే 80 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. దేశంలో కాఫీ ఉత్పత్తి చేసే 15రాష్ట్రాల ప్రతినిధులు కూడా హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సు లో అరకు కాఫీ ప్రాధాన్యత గురించి వివరించనున్నట్లు చెప్పారు.

చంద్రబాబు అరెస్టుపై నిరసనలు

టిడిపి నాయకుల ముందస్తు అరెస్టులు • పలుచోట్ల వివిధ రూపాల్లో ఆందోళనలు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నంద్యాలలో పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో పట్టణంలో ఎలాంటి సంఘటన జరగకుండా ముందస్తుగా జిల్లాలోని చోట్ల టిడిపి నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించగా, మరికొన్ని చోట్ల గృహనిర్బంధాలు జరిగాయి. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ప్రధాన కూడళ్లలో టిడిపి నాయకులు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. సిఎం జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం 11 గంటల వరకూ ఆర్‌టిసి బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు కూడళ్లలో పోలీసు గస్తీ ముమ్మరం చేశారు.

గృహనిర్బంధంలో ఉన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలో శనివారం టిడిపి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్రతో పాటు టిడిపి కౌన్సిల్ సభ్యులను, నాయకులు ముందస్తు అరెస్టులు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరెస్టులకు నిరసనగా బైఠాయింపు

8వ వార్డు టిడిపి కౌన్సిలర్ కోరాడ నారాయణరావు,కార్యకర్తలు నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి లు మాట్లాడుతూ, చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడం తప్పుడు చర్యని, ప్రజా సమస్యలపై పోరాడుతుంటే అరెస్టు చేశారని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని, తప్పుడు కేసు పెట్టారని ఈ కేసు నిలబడదని అన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఇంటి వద్దకు వెళ్లి అరెస్టు చేశారు. ఆమెతో పాటు మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, సోనలి రామారావును అరెస్టు చేసి ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. అలాగే ఎల్విన్ పేటలో తన ఇంటి వద్ద పలువురు టిడిపి నాయకులతో కలిసి ఉన్న రెండవ వర్గానికి చెందిన సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి, మంజువాణి, కొండలరావు, రామకష్ణ, చలపతి, వల్లభ రావును అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జియమ్మ వలస మండలంలో చినకుదమలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావును అరెస్టు చేసి చినమేరంగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎల్విన్ పేటలో టిడిపి నాయకులు మోకాళ్లపై నిరసన

గుమ్మలక్ష్మీపురంలోని పలుచోట్ల ఆందోళనలు కొనసాగాయి. రెండో వర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో నాయకులు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండలరావు, రామకష్ణ, చలపతి, మంజువాని, వల్లభ రావు ఉన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. అక్కడ నుంచి ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కద్రక కళావతి, జానకి పలువురు కార్యకర్తలు ఉన్నారు.

కొవ్వొత్తిలతో నిరసన

గుమ్మలక్ష్మీపురంలో శనివారం రాత్రి టిడిపి నాయకులు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు సొంటేన రాజేష్ , జానకి తదితరులు పాల్గొన్నారు.

సిఎం దిష్టిబొమ్మ దహనం

కురుపాం : చంద్రబాబునాయుడు అరెస్ట్ నిరసనగా టిడిపి నాయకులు ర్యాలీలు, ధర్నాలు చేస్తారని ముందస్తుగా టిడిపి మండల కన్వీనర్ కేవీ కొండయ్య, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకేశ్ చంద్రపండా, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, చిలకల వెంకటరావు, చందక రామకష్ణను పోలీసులు తెల్లవారుజామున ఆరు గంటలకే ఇంటి నుంచి స్టేషన్‌కు తీసుకువెళ్లి అరెస్టు చేశారు. ఈ అరెస్టుకు నిరసనగా పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ దహనం చేసిన టిడిపి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు వీరందరినీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

సీతంపేట చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు సీతంపేటలో ధర్నా చేపట్టారు. హై స్కూల్ నుంచి బస్టాండ్ వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తుండగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. అయితే స్టేషన్‌లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిరసనలో టిడిపి సీనియర్ నాయకులు పడాల భూదేవి, బిడ్డిక దమయంతి నాయుడు, మాజీ ఎంపిపిలు సవర మాలయ్య, ఆరిక లచ్చుమయ్య, మాజీ జెడ్పిటీసీ పాలక రాజబాబు, టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, మాజీ ఎంపిటీసీ, సర్పంచ్ లు సవర మల్లేష్, కె.విశ్వనాథం, సవర మంగయ్య, సవర బి.జయలక్ష్మి, సూర్యారావు, బిడ్డిక రామకృష్ణ, లావేటి రమణ తదితరులు ఉన్నారు.

సాలూరు: నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణిను ఆమె నివాసంలో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. అయితే ఆమె నిర్బంధాన్ని చేధించుకుని రోడ్డు మీదకు వచ్చారు. అఫీసియల్ కాలనీ రోడ్డులో ఆమె కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టారు. దీంతో సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోలీసులు ఆమెను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్ అప్పయ్యమ్మ, బి.పైడిరాజు అరెస్టయ్యారు. పోలీసు స్టేషన్ లో కూడా వారు బైఠాయించి సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌ను కూడా పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

కొమరాడ : స్థానిక జంఝావతి జంక్షన్‌లో టిడిపి మండల అధ్యక్షులు శనాపతి శేఖర్‌పాత్రుడు ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర రహదారిపైనా, రామభద్రపురం జంక్షన్ వద్ద టిడిపి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తమ్మయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిరసన కార్యక్రమాల వద్దకు వచ్చి టిడిపి నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచే కత్తిపై పోలీసులు విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.మధుసూదన్ రావు, జి.సుదర్శన్ రావు, పి.వెంకటనాయుడు, బొంగు భానోజీరావు, ఎం.సింహాచలం, ఎం.వెంకటనాయుడు, ఎం.తిరుపతినాయుడు తదితరులున్నారు.

భామిని : మండలంలో ఎలాంటి సంఘటనలూ చేపట్టకుండా మండల టిడిపి నాయకులు లోపింటి రాజేష్, భూపతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ఇతర టిడిపి నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సాయంత్రం పోలీసులు నాయకులను విడుదల చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, చంద్రబాబు నాయుడు అరెస్ట్ అన్యాయమని నినదించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, మండలి కమిటీ సభ్యులు బిడ్డికి ప్రసాద్, సాకేటి రామారావు, సర్పంచ్ లోపింటి రాజేష్, అంపిలి కేశవ, కోరాడ రాజేష్, సునీల్ శాంత్రో, ఆగుతాముడి. మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలానికి చెందిన 25మంది టిడిపి నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు తదితరులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు చెప్పారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన అరెస్టు దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల్లో నిరసనలు వ్యక్తం చేస్తు రోడ్లపై నిరసనలు చేపట్టారు.

పాలకొండ : టిడిపి నాయకులు ఆందోళనకు సిద్ధం కావడంతో వారిని ఎక్కడికి అక్కడే అదుపులోకి తీసుకున్నారు. టిడిపి అరుకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పల్లా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా సంతోష్ తదితరులను గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. దీన్ని నేతలు ముక్తకంఠంతో ఖండించారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద మండల పార్టీ వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : స్థానిక నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు తో పాటు సుమారు 20 మందిని పోలీసు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఉదయం స్టేషన్‌కు తరలించారు.

వీరఘట్టం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, నాయకులు నిరసన తెలిపారు. సైకో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోవాలి, ఈ రాక్షసపాలన మాకొద్దు, అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు నిమ్మక జయకృష్ణ స్వగ్రామం ఎం.రాజుపురానికి పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐ మురళీధర్, స్థానిక ఎస్ఐ ఎం.వెంకటరమణ గ్రామానికి వెళ్లి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ వస్తున్న టిడిపి నాయకులను అరెస్టు చేశారు. ఈ అరెస్టులకు నిరసనగా స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద పాలకొండ నియోజకవర్గం బాధ్యులు నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసనతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలోపార్టీ మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పారిచర్ల వెంకటరమణ, మాచర్ల అనీలు, బల్ల హరి బాబు, శశి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోసిపోయిన పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్

డిపోకే పరిమితమైన బస్సులు

చంద్రబాబును అరెస్టు చేసిన నేపథ్యంలో శనివారం నుండే జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్టీసీ డిపో వద్ద ఉన్న బస్సులను డిపో మేనేజర్ నిలిపివేశారు. దీంతో కాంప్లెక్స్‌కు వచ్చి పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగి ఆటోలను ఆశ్రయించడంతో ఆటోలకు గిరాకీ పెరిగింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉదయం 11గంటల వరకు ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలకొండ డిపో నుంచి సాయంత్రం 5గంటల తర్వాత బస్సులు తిరిగాయి.

సాలూరులో బైఠాయించిన టిడిపి నాయకులు సంధ్యారాణి

సీతంపేటలో పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించిన టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జగదీశ్వరి

వీరఘట్టం, కురుపాంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగుల గుంపు నుంచి విడిపోయిన ఏనుగు "హరి" ప్రస్తుతం కురుపాం మండలం బొడుకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి. ప్రసూన తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు "హరి" కొత్త బల్లుకోట, బల్లుకోట, తేకర్ఖండి, రావాడ, లక్ష్మీపేట, పెళ్లివలస, మంత్రజోల, మర్రిగూడ, సర్యానగరం, గొటువాడ గ్రామాల చుట్టుపక్కల సంచరించే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామస్తులు, ప్రయాణీకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రాత్రులు, వేకువ జామున మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. రాత్రులు కురుపాం - గుమ్మలక్ష్మి పురం ప్రధాన రహదారిని దాటే అవకాశం ఉంటుందని, ప్రయాణీకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. మిగిలిన ఏనుగులు కల్లికోట ముంపుడు ప్రాంతం (సబ్ మెర్జ్ డు)లో ఉన్నాయని, పాలకొండ ప్రాంతం నుంచి వచ్చిన నాలుగు ఏనుగులు కురుపాం రేంజ్ జరడ వద్ద ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఏనుగుల సంచారంపై గ్రామస్తులు అటవీశాఖకు సహకరించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కోసం దరఖాస్తులను అటవీ రేంజ్ అధికారికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

బాబు పాలన అవినీతిమయం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు పాలన అవినీతి, కుంభకోణాలమయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి అక్రమాల గురించి చెప్పకుండా ఇప్పుడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వంపై నిరంతరం బురద జల్లే ప్రయత్నంలో ఉన్నారని ఆరోపించారు. తండ్రి చంద్రబాబు, కొడుకు లోకేష్ ఇద్దరూ సిఎం జగన్‌పై ప్రతిరోజూ విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి కుంభకోణంలో చంద్రబాబునాయుడు పాత్ర వున్నట్లు ఆధారాలు లభించడం వల్లనే ఆయన్ను అరెస్టు చేశారని చెప్పారు. 2021లోనే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి శిక్షణ కోసం నకిలీ బిల్లులతో డొల్ల కంపెనీలకు ప్రభుత్వ నిధులు చెల్లింపు చేసినట్లు రుజువైందన్నారు. రూ.546కోట్ల ఖర్చు చూపగా దానిలో ప్రభుత్వ వాటా పదిశాత మని చెప్పారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3356కోట్లని, దానిలో ప్రభుత్వ వాటా పది శాతం వాటా అని తెలిపారు. సీమెన్స్ అనే జర్మన్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోకు, అప్పుడు కుదిరిన ఒప్పందానికి ఎక్కడా సంబంధం లేదని చెప్పారు. అంచలంచెలుగా రూ.371కోట్ల ప్రజాధనాన్ని డొల్ల కంపెనీలకు చెల్లించినట్లు నిర్ధారణ అయిందని చెప్పారు. జిఎస్టీ సంస్థ దర్యాప్తులో ఈ డొంక కదిలిందన్నారు. సుమన్ బోస్ అనే వ్యక్తి సిమెన్స్ కంపెనీ ప్రతినిధి అని చెప్పి ఒప్పందం చేసుకున్నారని, అయితే ఆ వ్యక్తి తమ కంపెనీ ప్రతినిధి కాదని కంపెనీ కోర్టులో వాంగ్మూలం ఇచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారం పై ఇంటెలిజెన్స్, ఐటి, సెబి, ఇడిలు కూడా విచారణ చేపట్టాయని చెప్పారు. సిఎం జగన్ లక్ష కోట్ల అవినీతి కుంభకోణానికి పాల్పడ్డారని ప్రతిపక్ష పార్టీ నాయకులు అడ్డగోలుగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఆధారాలతో నిర్ధారించుకున్న తర్వాతనే చంద్రబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఐటి శాఖ చంద్రబాబుకు నాలుగు సార్లు నోటీసులు ఇచ్చిందని చెప్పారు. తాను ఎప్పుడు ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయబోనని చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుపై టిడిపి నాయకులు సంధ్యారాణి విమర్శించినందునే తాను ఆమెపై విమర్శలు చేశానని ఒక ప్రశ్న కు సమాధానంగా ఆయన చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ గొర్లి జగన్మోహన్ రావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, వైసిపి నాయకులు హరి బాలాజీ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు రాజ్యాంగ ఉల్లంఘనే

కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఎటువంటి నోటీసుల్లేకుండా అక్రమంగా అరెస్టు చేయడం రాజ్యాంగ ఉల్లంఘనేనని కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్ర దేవ్ అన్నారు. శనివారం ఆయన కోట వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒకే పార్టీకి చెందిన వ్యక్తులను కనీసం ఇంటి నుంచి బయటకు రానీయకుండా ఆపుతూ, మరికొందర్ని పోలీస్ స్టేషన్లో పెట్టడం సమంజసం కాదని అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికే ఇలాంటి పరిస్థితి వస్తే సామాన్య ప్రజలకు ఎలా ఉంటదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఏదైనా జరిగి ఉంటే రాజకీయ నాయకులకు కానీ, అధికారులకు కానీ ఆరు మాసాల్లో విచారణ చేసి, అందులో ఏమైనా తేలినట్లయితే అప్పుడు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అన్నారు. కానీ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా అర్ధరాత్రి పూట అరెస్టు చేయడమంటే రాజ్యాంగం విరుద్ధమేనని అన్నారు. దీన్ని ప్రజలంతా గుర్తించుకొని సరైన సమయంలో సమాధానం చెప్పాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రతిపల్లెకు విస్తరించాలి

విశ్రాంత ఐఎఎస్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయ ప్రతి పల్లెకు విస్తరించేలా నిర్వాహకులు కృషి చేయాలని విశ్రాంత ఐఎఎస్ అదికారి టి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన ప్రాంగణంలో 25 వసంతాల జట్టు ట్రస్ట్ రజతోత్సవ వేడుకలు జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారి నాయుడు అధ్యక్షతన శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టి.విజయకుమార్ ముందుగా 1కె.మయంతి (ఐఎఎస్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్త్రీ, శిశు సంక్షేమం) సహకారంతో నిర్మించిన కార్యాలయ భవన సముదాయం, పర్యావరణహిత జట్టు గ్రంథాలయం, అన్నపూర్ణేశ్వరి సమావేశ మందిరం, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ వారి సహకారంతో నిర్మించిన గోడౌన్, సహజ ఎరువుల ఉత్పత్తి కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, రైతులు ఆర్థిక అభివృద్ధి చెందడానికి, మహిళా సంఘ సభ్యులను చైతన్యపర్చడంలో పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు ప్రతి పల్లెకు జట్టు సంస్థ సేవలు చేరవేయడం అభినందించదగ్గ విషయమన్నారు. జట్టు సంస్థ రూపకల్పన చేసిన ప్రకతి వ్యవసాయ ప్రార్థన గీతం "నేల తల్లికి వందనం మడి చేల తల్లికి వందనం" రాష్ట్రమంతా ప్రకృతి వ్యవసాయ ప్రార్థన గీతంగా ఆచరించి, సంస్థ రూపొందించిన ప్రకృతి వ్యవసాయానికి చెందిన 18 రకాల వాచకాలు ప్రతి రైతుకు, కార్యకర్తకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఇక్కడ తయారుచేసిన వ్యవసాయ పరికరాలు తక్కువ శ్రమతో ఎక్కువ ప్రయోజనం కలిగిన వీడర్లు తయారు చేయడం, మార్కెట్ రేటు కంటే తక్కువగా లభించడం ఇంకా మునుముందు రైతులకు మరింత ఉపయోగపడే విషయ పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పనిముట్లు తయారు చేయాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడడం, జీవవైవిద్యం పెంచే పంటలు వేయడం, భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెంచాలని, సహజ వనరులను ఉపయోగించి స్వయం సమృద్ధి సాధించే దిశగా మహిళా సంఘ సభ్యులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం జట్టు ట్రస్ట్ రజతోత్సవ సావనీర్ ఆవిష్కరణను, గ్రామీణ వికాస్ కేంద్రం సంస్థ సహకారంతో ప్రచురించిన గ్రంథం బాలసాహిత్య సరళిలో సహజ పంటల సర్వస్వం పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రకృతి వ్యవసాయ పుస్తక రచయితలకు రాయల్టీ, జ్ఞాపికలను, ట్రస్టీలకు జట్టు రజతోత్సవ పతకాల బహకరించారు. అలాగే ధర్మపక్షం బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం విశ్రాంత ఐఎఎస్ అధికారి దమయంతి మాట్లాడుతూ సొంత లాభం కొంతమానుకొని పరులకు పరోపకారం చేయడం, ప్రకృతిని, జీవరాశులను నష్టం కలుగు చేసే ఏ విధమైన హానికరమైన పనులు చేయకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, సమాజంలో గౌరవింపబడేటట్లు పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం టి.నాగార్జున, మేనేజింగ్ ట్రస్టీ ఎం.ప్రసాదరావు, విశ్రాంత ఐఆర్ఎస్ మేడిశెట్టి తిరుమల కుమార్, విశాంత్ర డిఐజి కె.పి.సి గాంధీ, డిజిటల్ గ్రీన్ సంస్థ స్టేట్ ఇన్ఛార్జి కె.నరేంద్ర, కె.నరేంద్ర, జిల్లా ప్రకతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖ రాజు, గ్రామీణ వికాస్ కేంద్రం వ్యవస్థాపకులు ఎ.అనిల్ కుమార్, జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టి ఎస్. ప్రహారాజ్. వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షులు, ఎఫ్‌పిఒ, డైరెక్టర్లు, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత్ ఐఎఎస్ విజయ్‌కుమార్

నగర సుందరీకరణ... అందమైన అబద్ధం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విజయనగరం సుందరీకరణ ఓ అందమైన అబద్ధం... ఈ మాటలు అంటున్నది ప్రాస కోసం పాకులాడే కవులు, రచయితలు అని నిందలు వేసేసి తప్పించుకుందామనుకుంటే పొరపాటే. నగరంలో మెజార్టీ ప్రజానీకం చెప్పుకుంటున్న వాస్తవ పరిస్థితి. ఇందులో అధికార పక్షం, ప్రతిపక్షం అన్న తేడా కూడా లేదు. ఈ మాటకొస్తే చివరికి వైసిపి కార్యకర్తలు కూడా ఇవే వ్యాఖ్యలను బలపరుస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. నగరంలో అభివృద్ధి - సుందరీకరణ పేరుతో ప్రస్తుత పాలకవర్గం రూ.కోట్లు ఖర్చుచేస్తోంది. కానీ, ఇటు సుందరీకరణా కనిపించడం లేదు. అటు అభివృద్ధి పనుల జాడ కూడా లేదు. దీంతో డబ్బంతా ఎటు వెళ్లిపోతోందో అంటూ జనం సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పైడితల్లమ్మ పండగ ముందు ఉమ్మితడి పనులు చేసేసి రూ.కోట్ల బిల్లులు చేసుకోవడం పాలకవర్గాలకు ఆనవాయితీగా మారిందని, ప్రస్తుత పాలకవర్గంలో అది మరింత ఎక్కువైందని జనం చర్చించుకుంటున్నారు. సుమారు నెల రోజుల క్రితమే మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను తొలగించారు. వాస్తవానికి వీటి ఏర్పాటుకు రెండేళ్ల క్రితమే సుమారు రూ.40 లక్షలు ఖర్చుచేశారు. కానీ, తొలగించారు. దీంతో ఆసుపత్రులు, స్కూళ్లకు వెళ్లే వాహనదారులు ఆయా గోతుల్లో పడిపోతున్నారు. ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా మారింది. ఇది కేవలం నగరవాసుల సమస్య మాత్రమే కాదు సుమా! జిల్లా కేంద్రానికి గుండెకాయ వంటి రహదారి ఇది. మన జిల్లాతోపాటు అటు పార్వతీపురం మన్యం, ఇటు విశాఖ, అటు శ్రీకాకుళం నుంచి నగరానికి వచ్చేవారందరికీ ఈ రహదారి అత్యంత కీలకమైనదే. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారిలో డివైడర్ హోల్డరింగ్‌ను ఎందుకు తొలగిస్తున్నారో? ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారో కనీసం ఒక బోర్డు కూడా పెట్టలేదు. దీనికితోడు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతుండడంతో జనం రగిలిపోతున్నారు. ట్రాఫిక్ భద్రత, సుందరీకరణ పేరిట డబ్బులు నొక్కేయడానికి తప్ప ఈ పనుల్లో జవాబుదారీతనం ఉన్నట్టుగా లేదని జనం బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అటు అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు నేటికీ పూర్తికాలేదు. ఇప్పటికీ గతుకులమయంగా ఉండడంతో జనం తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి అయ్యన్నపేట, పెద్దాసుపత్రి నుంచి గోకపేట మీదుగా బిసి కాలనీలకు తలపెట్టిన రోడ్ల విస్తరణ ప్రారంభానికి నోచుకోలేదు. విస్తరణ సంగతి కాసేపు అటుంచితే, నగరంలో పలు కాలనీల్లో వీధిరోడ్లు, లింకురోడ్ల అస్తవ్యస్తంగా మారాయి. ఉడాకాలనీలో పూర్వం వేసిన రోడ్లు ప్రస్తుతం రాళు తేలిపోతున్నాయి. అటు ఒకటో డివిజన్ అయ్యప్పనగర్‌లో మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. వర్షాకాలంలో రోడ్లపై గతుకుల్లో నీరు చేరుతోంది. కేవలం ఇవి మచ్చుకు మాత్రమే. నగరంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి. నగర పరిధిలో నిర్మాణాల అనుమతుల పేరిట ఇళ్లు, భవనాల నిర్మాణదారుల నుంచి రూ.లక్షలు గుంజుతున్నప్పటికీ తగిన మౌలిక సదుపాయాలు లేవు. ఎక్కడికక్కడ పార్కు స్థలాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదు. వాటిలో పిచ్చిమొక్కలు తొలగింపు, చుట్టు కంచెలకే రూ.లక్షలు ఖర్చుచేసినట్టు లెక్కల్లో చూపుతున్నారని కాస్త కార్పొరేషన్ కార్యకలాపాలను పరిశీలిస్తున్నవారు చెబుతున్నారు. కార్పొరేషన్‌లో అన్నీ తానై వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే వీటిపై దృష్టిపెట్టి, పనుల్లో పారదర్శకత పాటిస్తేనే పాలకవర్గానికైనా, ప్రభుత్వానికైనా మంచిదని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పక తప్పదని జనం చర్చించుకుంటున్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ : టిడిపి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం ఖూనీ చేస్తోందని టిడిపి యువనేత వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సిఐడి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. అరెస్టు గల కారణాలు, ఎటువంటి ఆధారాలు చూపకుండా అర్ధరాత్రి నుంచి సినీ ఫక్కీలో హైడ్రామా నడపారని తప్పుబట్టారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని మరోసారి రుజువైందని దుయ్యబట్టారు. న్యాయమే తుదకు విజయం సాధిస్తుందని, ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబును ఏమీ చెయ్యలేరని స్పష్టం చేశారు. అధినేత పిలుపు మేరకు ఉదయం నుంచి ఎంతో సంయమనం పాటిస్తున్న క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం శ్రేణులను చూసి గర్విస్తున్నట్లు వివరించారు.

'గడపగడపకు..' వాయిదా

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

నగరపంచాయితీ పరిధిలో శనివారం 5,7 వార్డుల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగాల్సిఉండగా పోలీసులు వాయిదా వేయాలని కోరడంతో అది వాయిదా పడింది. సమస్యలు చెప్పుకోవటానికి ప్రజలు సిద్ధమైనప్పటికీ కార్యక్రమం వాయిదా పడడంతో ప్రజలు ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

పరుగుపందెంలో పాల్గొన్న సంజన

పరుగుపందెంలో సంజన విన్నర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.సంజన శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధాన ఉపాధ్యాయులు సుంబోరా తెలిపారు. ఈనెల 20న ఏలూరులోని అల్లూరి సీతారాం రామరాజు స్టేడియంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయ ఎస్.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సోమేష్‌కు నగదు బహుమతిని అందజేస్తున్న అధికారులు

పరుగు పందెంలో గిరిజన యువకుడి ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పార్వతీపురంలో నిర్వహించిన 2023 యూత్ ఫెస్టివల్ పరుగు పందెం క్రీడలో గుమ్మలక్ష్మీపురం మండలం గౌడు గూడకు చెందిన బిడ్డిక సోమేశ్ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. పరుగు పందెంలో 5 కిలోమీటర్లు 17 నిమిషాల్లో పూర్తి చేసి ఈ ఘనత సాధించాడు. మొదటి బహుమతిగా రూ.10వేలు నగదు బహుమతి అందుకున్నాడు.

గీసిన బొమ్మలతో విద్యార్థులు

చిత్రలేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పిపి ఈతమానుగూడ పంచాయతీ ఇప్పగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ చిత్రలేఖనం (ఇది సింగ్) శుక్ర, శనివారాలు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ సవర మోహన్‌రావు చిత్రలేఖనంపై మెలుకువలు శిక్షణ ఇచ్చారు. అలాగే ఈ శిక్షణకు మూడు మండలాల నుండి 30మంది పాల్గొన్నారు. అంతరించిపోతున్న ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలు, చిత్రలేఖనం గూర్చి ఈ శిక్షణలో వివరించారు. శిక్షణను వెలుగు అసోసియేషన్ సిబ్బంది బి.వెన్నెల, ఎస్‌టి మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై స్టాపరుల ఏర్పాటు చేస్తున్న సిఐ, ఎస్ఐ

స్టాపర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిత్యం రద్దీగా ఉండే గుమ్మలక్ష్మీపురం - ఎల్విన్ పేట ప్రధాన రహదారి భద్రగిరి ఆసుపత్రి సమీపంలో ఎల్విన్ పేట పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. వాహనాలు నిత్యం రద్దీగా తిరగడంతో అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామ దేవత వాట్సాప్ గ్రూపులో ప్రజలు సమాచారం పెట్టారు. దీనిపై స్పందించిన సర్పంచి బొత్తాడ గౌరీ శంకరరావు ఈ సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో స్టాపర్లను శనివారం ఏర్పాటు చేశారు. స్టాపర్ల ఏర్పాటుతో ప్రధాన రహదారిపై వాహనదారుల వేగాన్ని నియంత్రించడానికి అవకాశం ఉంటుందని పోలీసులు తెలిపారు.

కోతి దాడిలో 12మందికి గాయాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో జరిగిన కోతి దాడిలో 12మందికి గాయాలయ్యాయి. శనివారం స్థానిక గాంధీ నగర్ కాలనీ, సెగిడి వీధిలో కోతి దాడి చేసి చిన్న పిల్లలను కరిచింది. ఎక్కడ నుంచో ఒక కోతి వీధిలోకి వచ్చిందని దానికి ఆదరించి ఆహారం పెడితే తిని పిల్లలతో ఆడుకొని ఒక్కసారిగా దాడి చేసి గాయ పర్చినట్ల స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారు స్థానిక సిహెచ్‌సిలో చికిత్స తీసుకున్నారు.

తగాదాలు వద్దు.. రాజీమార్గమే ముద్దు

ప్రజాశక్తి -పార్వతీపురం

సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

తగాదాలు వద్దని రాజీ మార్గమే శ్రేయస్కరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఎటువంటి సమస్యలతో కోర్టులకు వెళ్లకూడదన్నారు. కుటుంబ సమస్యలు, వివాహ, ఆస్తి తగాదాలు వంటి సమస్యలను పెద్దవారితో చర్చించుకొని రాజీ చేసుకోవాలని కోరారు. ఎక్కువగా వివాహ తగాదాలు కోర్టుకు వస్తున్నాయని తెలిపారు. వివాహ వ్యవస్థ అనేది చాలా బలమైందని, భార్యా భర్తలు అన్యోన్యంగా ఉండాలని చిన్న చిన్న సమస్యలను ఇరువురు కలిసి చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. పరిష్కారం కానీ సమస్యలుంటేనే కోర్టుకు రావాలని తెలిపారు. కక్షిదారులు కోర్టుకు రాలేని పక్షంలో వారి లాయర్‌తో వీడియో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఒకటి, రెండు రోజుల్లో కక్షదారులు కోర్టుకు హాజరై సంతకం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ అదాలత్‌లో 1918 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో సివిల్ కేసులు 14, క్రిమినల్ కేసులు 1855, మోటార్ వెహికల్ కేసులు 13, బిఎస్ఎన్ఎల్, లిటికేషన్ కేసులు 33, ఎక్సైజ్ కేసులు 3 పరిష్కారం చేశారు. సివిల్ కేసులకు సంబంధించి రూ.5,58,713 వసూలు చేసి కక్షిదారులకు అందించారు.

308 కేసులు పరిష్కారం

కురుపాం : స్థానిక ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన రాజీ తగ్గ కేసులను న్యాయమూర్తి డి.సౌజన్య, పార్వతీపురం న్యాయమూర్తి, మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురం కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో కురుపాం కోర్టుకు సంబంధించిన 302 ఎస్ టీసీ కేసులు, 6 క్రిమినల్ కాంపౌండర్ల్ కేసులతో కలుపుకుని మొత్తం 308 కేసులను పరిష్కారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అథాలత్ సభ్యులు, న్యాయవాదులు కె. చంద్రశేఖర్, లావణ్య, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో మున్సిపల్ యంత్రాంగం

ప్రజాశక్తి - బెలగాం

పట్టణంలో సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పథకం అంటూ ఏడాది క్రితం మున్సిపల్ కార్యాలయం ముందు శిలాఫలకం వేసి పట్టణ ప్రజల చెవిలో పాలకులు పువ్వులు పెట్టారని జనసేన నాయకులు ఆరోపించారు. శనివారం ఆ పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, తామరకండి తేజ, కర్రి మణికంఠ, పైల రాజు తదితరులు మున్సిపల్ కార్యాలయం ముందున్న శిలాఫలకం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమర్థతలేని మున్సిపల్ చైర్ పర్సన్ పాలనలో మున్సిపాలిటీలో సమస్యలు మూలుగుతున్నాయన్నారు. ఇటీవల వరద నీటికి పట్టణంలో జనశక్తి కాలనీ, నెల్లిచెరువుగట్టు, సౌందర్య సినిమా హాలు ప్రాంతం, బైపాస్ కాలనీ తదితరవి ముంపుకు గురయ్యాయన్నారు. అక్కడ బాధితులను పరామర్శించేందుకు గాని వారి బాధలను తెలుసుకునేందుకు గాని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రయత్నించకపోవడం ప్రజల దౌర్భాగ్యం అన్నారు. పట్టణ ప్రజలకు నాలుగైదు రోజులకు ఒకసారి కొళాయినీరు ఇస్తున్నారని, అది బురద నీరు ఇస్తున్నారన్నారు. ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజలను ఏమార్చేందుకు ఏడాది క్రితం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పథకం పేరుతో ఎఐఐబి ఆర్థిక సాయంతో రూ.63.63 కోట్ల అంచనాలతో పుష్కలంగా తాగునీరందిస్తామంటూ శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేశారన్నారు. శిలాఫలకం వేసాక పండావీధి ప్రాంతంలో మొక్కుబడిగా పనులు చేపట్టి తర్వాత పత్తా లేకుండా చేశారన్నారు. శిలాఫలకం వేసి ఏడాదికావస్తున్నా నిధులు, పనులు ఊసే లేదన్నారు. తాగునీటి విషయమై ఎవరు ప్రశ్నించినా ఆ శిలాఫలకం గూర్చే చెబుతూ ప్రజల చెవిలో పువ్వులు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పట్టణ ప్రజలకు పుష్కలంగా తాగునీరందించే పథకాన్ని అమలు చేయాలని కోరారు. దీని విషయమై ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు ఈ సందర్భంగా వారు మున్సిపల్ ప్రజలకు పుష్కలంగా, నిరంతరంగా తాగు ఇవ్వాలని నినాదాలు చేశారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న చీఫ్‌కోచ్ వెంకటేశ్వరరావు

ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధికాదని క్రీడా సాధికారి సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనా ర్యాలీని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి ఆర్‌సిఎం స్కూల్ వరకు నిర్వహించారు. ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ మాట్లాడుతూ హెచ్‌ఐవి వైరస్ నిర్మూలనకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. హెచ్‌ఐవి చాలా సున్నితమైన వైరస్ అని అన్నారు. హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులతో కలిసి ఆహారం తీసుకున్నా, వారిని తాకినా ఈ వ్యాధి వ్యాప్తి చెందదని చెప్పారు. ఎయిడ్స్, హెచ్‌ఐవి బాధితులు ఉపయోగించిన వస్తువులను ఎవరైనా వినియోగించవచ్చని పేర్కొన్నారు. వ్యాధిగ్రాస్తులను కౌగిలించుకోవడం, ముద్దు పెట్టుకోవడం చేసినా ఎయిడ్స్ వ్యాధి సోకదని వివరించారు. వ్యాధిగ్రస్తులు ఉపయోగించే సూదులను వాడకూడదన్నారు. అరక్షిత శృంగారం వల్ల హెచ్‌ఐవి బారిన పడే అవాశాలున్నాయని, కండోమ్ ఉపయోగించడం మంచిదని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఐవి వ్యాధి సోకిందంటే చనిపోవడం తప్ప మార్గం లేదని భావించేవారని, ప్రస్తుతం వైద్యశాస్త్రం కూడా ఎంతగానో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.

హెచ్‌ఐవిని సమూలంగా, శాశ్వతంగా తగ్గించలేక పోయినప్పటికీ ఆ వ్యాధితో పోరాడేందుకు శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను బలపరిచేందుకు చాలా మందులు అందుబాటులో ఉన్నాయనన్నారు. ఏఆర్టీ - యాంటీ రెట్రోవైరల్ థెరపీ తీసుకోవడం ద్వారా బాధితులు కూడా ఎక్కువ కాలం పాటు జీవించే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు వైరల్ లోడ్, సీడీ4 కౌంట్ పరీక్షలు చేయించుకుంటూ, ఆరోగ్య పరిస్థితిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. హెచ్‌ఐవి సోకిన తర్వాత ఆ వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి ఒక్కొక్కరికి ఒక్కోలా సమయం పడుతుందన్నారు. రోగనిరోధక వ్యవస్థ ఎంత బలంగా ఉంటే ఈ వ్యాధి లక్షణాలు అంత ఆలస్యంగా బయటపడతాయని, ఈ వైరస్ సోకిన వెంటనే ఎలాంటి లక్షణాలు కనిపించవని తెలిపారు. హెచ్‌ఐవి లేదా ఎయిడ్స్ సోకిందన్న అనుమానం ఉంటే మూడు నెలలకోసారి పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధి వచ్చిందా, లేదా తెలుస్తుందన్నారు. వైరస్ తగ్గిపోతే ఇక వ్యాధి వ్యాపించదని, ఏఆర్టీ తర్వాత ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో వైరల్ వ్యాప్తి రోజురోజుకీ తగ్గిపోయి, చివరకు పరీక్షల్లో గుర్తించలేని స్థాయికి చేరిపోతుందన్నారు. చాలామంది వ్యాధి తగ్గిపోయిందనే ఉద్దేశంతో మందుల వాడకం ఆపేస్తున్నారని అందువల్ల శరీరంలో వైరస్ లోడ్ తగ్గినా, మళ్లీ వైరస్ సోకే అవకాశం ఉండవచ్చని వివరించారు. వైరస్ లోడ్ పూర్తిగా తగ్గినా బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాజెక్టు మేనేజర్ పి. బాలాజీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహన రావు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వినోద్, డివిఎస్ గుప్త, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. వైద్య సిబ్బంది గర్భిణులకు చేపడుతున్న ఆరోగ్య తనిఖీలు, రక్త పరీక్షలు ఆయన పరిశీలించారు. ఎంత మంది గర్భిణీలకు తనిఖీలు చేపట్టారు. వీరిలో ఎంత మందిని హైరిస్క్‌గా గుర్తించారు, కాన్పు సమయం దగ్గరగా ఉన్న వారు ఎంత మంది, అరుదుగా ఉన్న బ్లడ్ గ్రూప్‌తో ఎంత మంది ఉన్నారు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం ఆయన ఆసుపత్రికి వచ్చి గర్భిణీల ఆరోగ్యం పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వారి వద్ద ఉన్న మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి వివరాల నమోదుకు సంబంధించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలన్నీ పిహెచ్‌సిలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గర్భస్థ పిండం ఎదుగుదల తీరు, లోపాలను గుర్తించేందుకు జరిపే టిఫ్ఫా స్కానింగ్ ఇప్పుడు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. హై రిస్క్, రక్త హీనత గర్భిణీలను ఆసుపత్రికి చేర్చేందుకు తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం అందుబాటులో ఉందన్నారు. అలాగే పిఎమ్ఎమ్ వివై, జెఎస్ వై, ఆరోగ్య ఆసరా మొదలగు సంక్షేమ పథకాలున్నాయని, గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన సత్యసాయి ట్రస్ట్ వారు గర్భిణులకు ఉచితంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్ వైజర్లు చిన్నమ్మి, ఉదయ కుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గర్భిణీలకు వైద్య తనిఖీలు

వీరఘట్టం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని శనివారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తు, బరువు తదితరమైన తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆవా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు మేలు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతులకు మేలు చేకూర్చే నవధాన్యాల సాగు మేలని రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలసలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బొబ్బిలి సబ్ డివిజన్‌లో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను సంబంధిత వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏయే పద్ధతుల్లో ఏయే పంటలు వేస్తున్నారని, అవలంబిస్తున్న పద్ధతుల గురించి అడిగారు. ప్రకృతి వ్యవసాయ విధానాలని తెలుసుకొని మరింత ఎక్కువ విస్తీర్ణంలో ఈ విధానాల్ని విస్తరించడానికి ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని అక్కడ ఉన్న రైతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మన పంటలకు ముందుగా నవధాన్యాలు వేసుకోవడం వల్ల ఎంత ఉపయోగం ఉంటుందనే విషయాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆయనకు డాక్టర్ స్వామినాథన్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రభంధకులు, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ ఎడిఎ, బొబ్బిలి ఎడిఏలు వి.టి రామారావు, ఆనందరావు, ప్రకాశరావు, శ్యాం సుందర్, సర్పంచ్ పి. మధవరావు, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

15న వైద్య కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ ఈ నెల 15న విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖా మంత్రి విడుదల రజని తెలిపారు. దీంతోపాటు రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు వైద్య కళాశాలలను కూడా ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వి.టి.కృష్ణబాబు, ఎపిఎంఎస్ ఐడిసి ఎండి మురళీధరరెడ్డితో కలిసి మంత్రులిద్దరూ శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికలపై చర్చించి, పలు సూచనలు చేశారు.

బాబోయ్ కుక్కలు

భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఒకప్పుడు శునకాలను గ్రామ సింహాలనే పిలిచేవారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్తవారు వస్తే భౌభౌభౌ అంటూ అరిచేవి. ప్రస్తుతం ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రక్తాన్ని రుచి చూసిన శునకాలు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. శునకాలు గుంపు గుంపులుగా తిరగడం వల్ల వాటిని చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇప్పటికే వందల సంఖ్యలో కుక్క కాటుకు గురై వైద్యం పొందుతున్నారు. ఈనెల 7న రాత్రి మండల కేంద్రంలోని కుక్కలు గుంపుగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల నుంచి ఎలాంటి హాని కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

11న పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఈ నెల 11న ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులకు రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ ఉద్యోగుల భవనంలో ఉదయం 10 గంటలకు నెల వారీ సమావేశం జరుగునని ఆ సంఘం అధ్యక్షులు గంట జగన్నాథం నాయుడు, కార్యదర్శి దొడ్లంకి గణపతి రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పెన్షన్‌దారులంతా సకాలంలో రైతు బజారు పక్కన విశ్రాంతి ఉద్యోగుల భవనానికి హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో సమస్యల పరిష్కారం గూర్చి చర్చించనున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారి హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎగ్జామినేషన్ షిప్ సూపరింటెండెంట్ టి.శంకర్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశారధ పరీక్షకు 29 మందికిగాను 28 విద్యార్థులు, భూషన్ పరీక్షకు 21 మందికి 20 మంది విద్యార్థులు, విద్వాన్ పరీక్షకు 11మందికి గాను 9 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం స్థానిక మున్సిపాల్టీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పట్టణంలో కొత్తవలసలో ఉన్న ఏడో వార్డు నందమూరి కాలనీ మొదటివీధిలో సిసి రోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గడపగడపకు నిధుల నుంచి రోడ్డు, కాలువ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం 8వ వార్డు పెద్దవీధిలో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డు నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, వార్డు కౌన్సిలర్లు బొత్స ఆనంద్, పి.జయంతి, జి.గాయత్రి, ఎస్.లావణ్య, వి.నేతాజీ, ఎన్.సుధీర్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, ఎన్ సదానందం, వైసీపీ నాయకులు, , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్స్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రభుదాస్

శానిటరీ ప్యాడ్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మూలగూడలో పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్‌ల వినియోగంపై హెూలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అధ్వర్యాన శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్ వాడకం వల్ల, మహిళల ఆరోగ్యానికి, పర్యావరణానికి శ్రేయస్కరమని, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్ బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో హెూలీ క్రాస్ సంస్థ ద్వారా కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్‌లో పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్‌ల తయారీని నేర్పిస్తూ, వారు కుట్టిన గుడ్డ ప్యాడ్‌లను గ్రామంలో పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్ బ్యాంక్ ను ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సంస్థ కార్యకర్త శ్రీవిద్య మహిళలు నెలసరి పరిశుభ్రతపై సింథటిక్ ప్యాడ్ వినియోగం వల్ల కలిగే అనార్థాలు, పర్యావరణ అనుకూల గుడ్డ శానిటరీ ప్యాడ్ వల్ల ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు.